

వైఎస్ఆర్

7న చలో తిరుపతి


ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో పనిచేస్తున్న ఉద్యోగ,కార్మికులు ఈనెల 7న చలో తిరుపతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని, విజయ వంతం చేయాలని స్ట్రగుల్స్ కమిటీ శుక్రవారం పిలుపునిచ్చింది. విద్యుత్ కార్మికుల, ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ˆశల వారి ఉద్యమంలో భాగంగా తిరుపతిలోని ఎస్పిడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ముద్రించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆర్‌టిపిపి మెయిన్ గేట్ వద్ద యూనియన్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం వారం రోజులుగా ఉద్యమాలు చేస్తున్న యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ స్పందించకపోవడం అన్యాయం అని అన్నారు. అందువల్లనే తిరుపతిలో మహా ధర్నా చేయనున్నట్టు పేర్కొన్నారు. అప్పటికీ స్పందించకపోతే ఈనెల 10న సమ్మెబాట పడదామని తెలిపారు.

అంగళ్లులో తీవ్ర ఉద్రిక్తత

టిడిపి, వైసిపి పరస్పరం రాళ్ల దాడి
చంద్రబాబు కాన్వాయ్‌పైనా...
ఆరుగురు టిడిపి కార్యకర్తలకు గాయాలు
20 వాహనాలు ధ్వంసం
పెద్దిరెడ్డి రౌడీయిజాన్ని పాతాళానికి తొక్కేస్తా : నారా చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-కురబలకోట/మదనపల్లె అర్బన్

అధికారమే అండగా అన్నమయ్య జిల్లాలోని కురబలకోట మండలం అంగళ్లులో వైసిపి శ్రేణులు రెచ్చిపోయారు. సాగు నీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ములకలచెరువు మండలంలోని సోంపాళ్యం వద్ద నాయని చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సందర్శించి ములకచేరువు మీదుగా కాండ్లమడుగు క్రాస్ వద్ద నున్న హంద్రీనీవా కెనాల్‌ను పరిశీలించారు. అనంతరం అంగళ్లుకు చేరుకొని మదనపల్లె బైపాస్ మీదుగా రోడ్డు షో నిర్వహించారు. మదన పల్లె బైపాస్ రోడ్డులో టిడిపి నాయకులు గజమాలతో సత్కరించారు. కురబలకోట మండలం అంగళ్లు శుక్రవారం రణరంగంగా మారింది. రెచ్చిపోయిన వైసిపి కార్యకర్తలు టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మీద రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఎన్ఎస్‌జి కమాండోలు బాబుకు రక్షణగా నిలబడ్డారు. వైసిపి మూకల దాడిలో ఆరుగురు టిడిపి కార్యకర్తలు గాయపడ్డారు. టిడిపి బ్యానర్లను వెసిపి శ్రేణులు చించి వేశాయి. రెండు గ్రూపులు బాహాబాహికి దిగాయి. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. చంద్రబాబు అంగళ్ల నుండి వెళ్లిపోయిన తరువాత మళ్ళీ వైసిపి మూకలు మరోసారి దాడులకు తెగబడ్డారు. 20 వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా గురువారం నుండి ఉమ్మడి జిల్లాలో ఉద్రిక్తత ఏర్పడింది. చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటామని వైసిపి నాయకులు ప్రకటించారు. పుంగనూరులో అడుగు పెట్టకూడదన్నారు. పోలీసులు చంద్రబాబు రోడ్డు షోకు అనుమతి నిరాకరించారు. గురువారం నుండి రెండు గ్రూపులు మొకలిల్లాయి. అడ్డుకోవడానికి వైసిపి, బాబు పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి శ్రేణులు పట్టుపట్టాయి. వైసిపి శ్రేణులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా తంబల్లపల్లిలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు.



అంగళ్లులో మాట్లాడుతున్న చంద్రబాబు

పెద్దిరెడ్డి రౌడీయిజాన్ని పాతాళానికి తొక్కేస్తా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి సోదరుల అరాచకాలు తారా స్థాయికి చేరాయని చంద్రబాబు ఆరోపించారు. మీ రౌడీయిజాన్ని, అరాచకాలను పాతాళం లోకి తొక్కేస్తానని హెచ్చరించారు. ఇలాంటి నీచ రాజకీయాలు రాష్ట్రంలో ఎప్పుడూ లేవన్నారు. పెద్దిరెడ్డి పతనం ఈ రోజు అంగళ్ళు నుండి ప్రారంభమైం దన్నారు. ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. దీంతో మరో సారి రాళ్ళ దాడి జరిగింది. రక్షణ సిబ్బంది బాబుకు రక్షణగా నిలపడ్డారు. అంగళ్లలో ఉద్రిక్తత మంత్రి రామచంద్రారెడ్డి, పోలీసుల పనిగా చంద్రబాబు వర్ణించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలియుగ రావణాసురుడిగా అభివర్ణించారు. ఇలాంటి వారిని భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పుంగనూరుకు వెళ్తున్నా ఆ పుడింగి సంగతి తేలుస్తానని సవాల్ చేశారు. బాంబులకే భయపడలేదని నాలుగు రాళ్లు వేస్తే భయపడతానా అంటూ ఎదురు దాడి చేశారు. పులివెందుల వెళ్లాను, చిత్తూరులో పర్యటించడానికి అడ్డంకి ఎందుకు అని ప్రశ్నించారు. ఈ జిల్లాలోనే పుట్టాను ఇలాంటి రాజకీయాలు చాలా చూశానని పేర్కొన్నారు. టిడిపి ఎవరిమీద దౌర్జన్యం చేయదని టిడిపి మీద దౌర్జన్యం చేస్తే వదిలేది లేదన్నారు. డిఎస్‌పి అసమర్థత కారణంగానే దౌర్జన్యం జరిగిందని, యూనిఫారం విప్పేయలని సూచించారు. వైసిపి నాయకులు పోలీసుల అండదండలతో దౌర్జన్యాలు చేస్తున్నారని పోలీసులు లేకుండా ధైర్యం ఉంటే ముందుకు రావాలని సవాల్ చేశారు. అంగళ్లు, పుంగనూరు సంఘటన తన జీవితంలో మర్చిపోనన్నారు. ఇది ఒక బ్లాక్ డే గా వర్ణించారు. ఇంతకు ఇంతా తీర్చుకుంటానని పేర్కొన్నారు. తప్పకుండా చర్యలు తీసుకుంటానన్నారు. గాయపడిన కార్యకర్తలకు అండగా ఉంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు అమరనాథ్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగళ్లులో మోహరించిన టిడిపి, వైసిపి శ్రేణులు





వైసిపి, టిడిపి శ్రేణుల పరస్పర దాడిలో ధ్వంసమైన కార్లు





రాళ్ళ దాడిలో గాయపడిన టిడిపి కార్యకర్తలు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- జీతాల జాప్యంపై ఉపాధ్యాయ సంఘాల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒల జీతాల చెల్లింపులో విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరి తగదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి.రమణారెడ్డి, ఎం.విజయకుమార్, జి.వెంకటసుబ్బారెడ్డి, హరి కొండయ్య పేర్కొన్నారు. ఎస్టీయు, యుటిఎఫ్, హెచ ˆఎంఎ, బిటిఎ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మహవీర్ సర్కిల్ నుంచి డిఇఒ కార్యాలయం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ దగ్గర చేపట్టిన నిరసన ప్రదర్శనలో వారు మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న కాలంలోనూ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయి రెండు నెలలు కావస్తున్నప్పటికీ కేడర్ స్ట్రెంత్ అప్డేట్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. చిన్న చిన్న కారణాలకు ఉపాధ్యాయులను బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకుంటున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు వేల మంది ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాల విషయంలో మాత్రం స్పందించకపోవడం అన్యాయమన్నారు. నెలసరి వేతనజీవులు ఒకటోతేదీన వచ్చే జీతాలకోసం ఎదురు చూస్తుంటారని, అలాంటిది రెండు నెలల పాటు జీతాలు రాకపోతే వారు ఎలా జీవనాన్ని కొనసాగిస్తారో ఆలోచించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు విద్యాశాఖలో గతంలో ఎపుడూ చూడలేదన్నారు. నూతన జాతీయ విద్యావిధానం అమలు పేరుతో చేపట్టిన పాఠశాలల విలీనప్రక్రియ ప్రాథమిక విద్యావ్యవస్థకు శరాఘాతమన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన విద్యారంగంలో సంస్కరణలు చేసేటపుడు మేధావులు, సంఘాలతో చర్చించకుండా అమలు చేస్తే, ఇలాంటి దుష్పరిణామాలు తప్పవని చెప్పారు. ఉపాధ్యాయులకు జీతాలు రాని కారణంగా వారు గృహ, వ్యక్తిగత, వాహన తదితర రుణాలకు సంబంధించిన ఇఎంఐలు సకాలంలో చెల్లించని కారణంగా,పెద్ద మొత్తంలో పెనాల్టీలు చెల్లించడంతో పాటు, బ్యాంకులలో సిబిల్ స్కోర్ తగ్గి భవిష్యత్ లో ఎలాంటి రుణాలు పొందే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే జీతాలు చెల్లించకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటి స్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ ఽకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లు రఘునాథరెడ్డి, గురుకుమార్, మహేష్ బాబు, వెంకటసుబ్బయ్య, వంశీ కృష్ణ, ఇలియాస్‌బాష, రవికుమార్, నరసింహారావు, సివి.రమణ, ఏజాస్ అహ్మద్, ప్రభాకర్, సంగమేశ్వరరెడ్డి,శివారెడ్డి పాల్గొన్నారు.

మోడీని సాగనంపండి..దేశాన్ని కాపాడండి

-6,7న జిల్లా వ్యాప్తంగా స్కూటర్ ర్యాలీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

మోడీ ప్రభుత్వం ఆలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విజయవాడలో నిర్వహించే మహాపడావ్, కడపలో హెడ్‌పోస్టు ఆఫీసు వద్ద నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మనోహర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 44 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని విమర్శించారు వ్యవసాయ చట్టాల రూపంలో రైతుల భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తీసుకొచ్చే విశాఖ ఉక్కు, ఎల్‌ఐసి, ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేట్ దోపిడీ దారులకు అప్పగించేందుకు చర్యలు ముమ్మరం చేస్తున్నారని చెప్పారు. 8 ఏళ్ల కాలంలో ఆరు లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని, వీటిలో పనిచేసే లక్షలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని వాపోయారు. భారతదేశం మోడీ హయాంలో ఆకలి సూచికలో బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకంటే వెనుకపడినట్లు ప్రపంచ గణాంకాలు తెలియ జేస్తున్నాయన్నారు. కార్మికులకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలన్నీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. సమావేశంలో ఎఐటియుసి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, కె.శ్రీనివాసులురెడ్డి, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, లింగన్న పాల్గొన్నారు.

రేపు అండర్-20 జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

కడప : కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో అండర్ - 20, సీనియర్స్ జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు ఈనెల 6న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మామిడి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, జన్మధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్ తో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు 9912020424, 9959006388లలో సంప్రదించాలన్నారు.

కొప్పర్తి సర్పంచ్‌కు హైకోర్టులో ఊరట

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని స్థానిక కొప్పర్తి పంచాయతీ సర్పంచ్ కె.సుజాతమ్మకు హైకోర్టులో ఊరట లభించింది. గత నెల 20 న గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఉప సర్పంచ్‌తో సహా కొంతమంది వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. వారు సర్పంచ్‌కు నోటీసులు జారీ చేశారు. సర్పంచ్ ఇచ్చిన సంజాయిషీతో సంతృప్తి పడని అధికారులు చెక్ పవర్ రద్దు చేసిన విషయం తెలిసిందే, దీనిపై సర్పంచ్ సుజాతమ్మ హైకోర్టుకు వెళ్లి చెక్ పవర్ రద్దుపై స్టే తెచ్చుకున్నారు. దీంతో కొప్పర్తి రాజకీయాలు రసవత్తంగా మారాయి.

సురేంద్రనాథరెడ్డిని తొలగించకపోతే ఉద్యమం

కడప అర్బన్ : అక్రమ మార్గంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం పొందిన ఇ.సి.సురేంద్రనాద్ రెడ్డిని తొలగించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విద్యార్థి, యువజన సంఘం నాయకులు తెలిపారు. నగరంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యాల యంలో విద్యార్థి, యువజన సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైవీయూ విసి చింతా సుధాకర్, పాలకమాండలి సభ్యులు అందరు కుమ్మక్కై నిబంధనలను తుంగలోతొక్కి సురేంద్రనాథ్‌రెడ్డిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించారని తెలిపారు. దీని పై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జియావుద్దీన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్ కుమార్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు బి.సురేష్ నాయక్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ నిరుద్యోగ సంఘం నాయకులు శ్రీనాథ్, శ్రీనివాసుల రెడ్డి, గౌస్ పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి -కడప

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని ఉప ముఖ్యమంత్రి ఎస్. బి.అంజాద్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష తన నివాస కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ 9.16 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. కడప నగరంలో నాలుగేళ్లలో రూ 8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయం కింద పేదలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు.

బాలుడి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సకు ఆర్థిక భరోసా.... స్థానిక నాగరాజ్ పేట మున్సిపల్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న మహమ్మద్ హాకీబ్ కాలేయం దెబ్బతినిందని తల్లిదండ్రులు బాబా పక్రుద్దీన్, హసీనా తెలిపారు. చెన్నైలోని బేబీ చిల్డ్రన్ కేర్‌లో చూపిస్తున్నామని లివర్ ట్రాన్స్ ప్లాంటుకు దాదాపుగా 30 లక్షల వరకు ఖర్చు అవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా కు వారు విన్నవించుకున్నారు. ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ కింద బాలుడికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించడానికి శాయశక్తులకు కృషి చేస్తానని వారికి ఆర్థిక భరోసా కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్సీపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్‌డి ప్రసాదరావు

ఆరోగ్యమాత తిరుణాల పోస్టర్ ఆవిష్కరణ

కడప అర్బన్ : ఆరోగ్య మాత తిరునాలను జయప్రదం చేయాలని పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎండి ప్రసాదరావు కోరారు. శుక్రవారం ఆరోగ్య మాత చర్చిలో తిరుణాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిషప్ డాక్టర్ గాలి బాలి ఆదేశాల మేరకు ఈనెల 29 నుంచి ఆరోగ్యమాత ఉత్సవాలు పతాక ఆవిష్కరణ ద్వారా ప్రారంభమై, తొమ్మిది రోజులపాటు నవదిన పూజ ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. 7, 8 తేదీలలో నగరంలోని ప్రధాన రహదారుల గుండా తల్లి ప్రత్యేకంగా అలంకరించబడిన తేరు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక దివ్యబలి పూజ ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ డైరెక్టర్, డాక్టర్ రెవ ఫాదర్ విల్సన్, తిరుణాల కమిటీ సభ్యులు, మరియదళం, విన్సెంట్ ది పాల్, మౌలిక సంఘం, శాంతి సేవా సొసైటీ సభ్యులు, కమిటీ పెద్దలు అంతోని, డేవిడ్, సబస్టియన్, మోహన్, రాజేష్, కళ్యాణ్, వినిత్, సిస్టర్ స్వప్న, లూర్దు పాల్గొన్నారు.



తల్లిపాలవారోత్సవ వేడుకల్లో డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ శిరీషా

తల్లి పాలతోనే బిడ్డ ఆరోగ్యం


ప్రజాశక్తి- కడప అర్బన్

తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారని చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నాగార్జున రెడ్డి, డాక్టర్ శిరీషా పేర్కొన్నారు. శుక్రవారం చెన్నై చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ప్రపంచ చిన్న పిల్లల దినోత్సవం సందర్భంగా పురిటి పిల్లల తల్లులకు తల్లిపాలు, ముర్రు పాలు వలన పిల్లలకు కలిగే ప్రయోజనాలపై నాటకం ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డను ప్రసవించిన అనంతరం మొట్ట మొదటిసారిగా ముర్రుపాలను బిడ్డకు తప్పనిసరిగా అందివ్వాలని పేర్కొన్నారు. ముర్రుపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందని చెప్పారు. నెలలు నిండిన మహిళలకు మురుపాలపై అవగాహన కల్పించామని తెలిపారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు ఎటువంటి ద్రవ ఆహారం ఇవ్వకూడదని, తల్లిపాలే సరిపోతుందన్నారు. ఉద్యోగ నిర్వహణలో ఉన్న వారికి, తల్లిపాలను నిలువ ఉంచడం, పిల్లలకు పాలు ఎలా పట్టాలి, పిల్లలకు పాలిచ్చే తల్లులు అనారోగ్యాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించామన్నారు. పురిటి పిల్లలు ఆకలితో ఏడ్చే ఏడుపు, అనారోగ్యంతో ఏడుపుకు వ్యత్యాసాన్ని తెలియజేశారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పురిటి బిడ్డల తల్లులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ప్రతి తల్లీ పిల్లలకు పాలు పట్టించడం శ్రేయస్కరమని బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి, సిడిపిఒ రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నాగలగట్ట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ వెంకటలక్ష్మి, సావిత్రి, మహిళా పోలీస్ రామలక్ష్మి, కౌన్సిలర్ కుండా సావిత్రి, టీచర్లు లక్ష్మి కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ ఒబిసి మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కడప సిటీ

ఈనెల 7వ తేదీన తిరుపతిలో నిర్వహించే జాతీయ బిసి మహాసభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పాత రిమ్స్‌లోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతి లోని టౌన్ క్లబ్ సర్కిల్ మహతి ఆడిటోరియంలో జాతీయ బిసి మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభకు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలో బిసిల జన గణన ను కేంద్రం వెంటనే చేపట్టాలని, చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని, బిసిలపై రుద్దిన క్రిమిలేయర్ ను వెంటనే కేంద్రం రద్దు చేయాలని, ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, తదితర అంశాలపై చర్చిస్తారని తెలిపార కార్యక్రమంలో జిల్లా జిల్లా ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్ బాషా జిల్లా మహిళా అధ్యక్షులు నారాయణమ్మ, రాష్ట్ర కార్యదర్శి తొర్రి వేముల జయశ్రీ, జిల్లా గౌరవ అధ్యక్షులు పి గురుస్వామి రాష్ట్ర కార్యదర్శి గువ్వల మధుసూదన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణ్ సుధాకర్, పస్తం అంజి , రేవీళ్ళ మునిరత్నం గౌడ్ పాల్గొన్నారు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బిసి నాయకులు

భావితరాలకు సంపూర్ణ ఆరోగ్యం : జెసి

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వం అందించే సంపూర్ణ పోషణ పథకం ద్వారా ఇంటి వద్దనే రేషన్ అందుకుని ప్రయాస లేకుండా భావితరాలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని జెసి జి.గణేష్ కుమార్ బాలింతలు, గర్భిణులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ విసి హాలులో జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా లబ్ది పొందిన జిల్లాలోని బాలింతలు, గర్భిణులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెసితోపాటు ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మీదేవి, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జెడి ఎ. పద్మజ, పిడి శ్రీలక్ష్మి, డిసిహెచ్ఎస్ డాక్టర్ వై. హిమదేవి హాజరయ్యారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 6 ఏళ్ళ లోపు చిన్నారుల్లో రక్త హీనత, పోషకాహార లోపాన్ని నివారించి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషణ పథకం అమలవుతోందన్నారు. ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాల్లో అమలవుతున్న ఈ పథకం లబ్దిని బాలింతలు, గర్భిణుల సౌలభ్యం కోసం పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సీడీపీవోలు, సంబంధిత శాఖల అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణుల, బాలింతలు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** పట్టణంలోని రాణివనం-1 అంగన్వాడీ కేంద్రంలో 20వ వార్డు కౌన్సిలర్ ఎస్.ఎం.డి అలీ చేతులమీదుగా గర్భిణులకు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గర్భిణులకు, బాలింతలకు మంచి పౌష్టిక ఆహారం అందిస్తున్నారని, పుట్టబోయే చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు టేక్ హోమ్ రేషన్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చంద్రకళ,వ ఽహిళా పోలీస్ శబిరున్, ఎఎన్ఎం రాజ సులోచన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంత కుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బీదనంచర్ల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులుకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

రేపు పిసిసి అధ్యక్షులు రాక

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్ర రాజు ఈనెల 6న విచ్చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై .విష్ణు ప్రీతమ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడంలో భాగంగా అన్ని అసెంబ్లీలకు కన్వీనర్లను నియమించారని చెప్పారు.. రాయలసీమలోని ఐదు జిల్లాల కన్వీనర్లతో సమావేశం నిర్వహించి వారి విధులు గురించి దిశా నిర్దేశం చేయడానికి రాష్ట్ర అధ్యక్షులు వస్తున్నారన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కన్వీనర్లతో సమావేశంలో పాల్గొంటారు అని తెలిపారు. పిసిసి అధ్యక్షులతో పార్టీ ఎఐసిసి కార్యదర్శి సీడీ మయప్పన్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు రాయలసీమ జిల్లాల ఇన్‌ఛార్జి జంగా గౌతమ్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. కావున ఐదు జిల్లాల కు సంబంధించిన కన్వీనర్లు అంతా సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ ఆర్టీఐ విభాగం రాష్ట్ర చైర్మన్ లక్ష్మయ్య, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నపూస మధు రెడ్డి, కార్మిక విభాగం కమలాపురం అధ్యక్షుడు జాదవ అశోక్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణుప్రీతమ్‌రెడ్డి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి మరవడం దుర్మార్గం అన్నారు. అసెంబ్లి సాక్షిగా ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాద యాత్ర లో ఇచ్చిన హామీ మేరకు సమాన పనికి వేతనం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 7ను కూడా ఎక్కడా అమలు చేయలేదని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల కు స్కిల్స్ వేతనాలు ఇవ్వాలని తెలిపారు. విధిలేని పరిస్థితిలో పోరాటం చేస్తున్నామని చెప్పారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శులు బ్రహ్మానంద రెడ్డి, ఆనందరావు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, వాయనాడ్ లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీ పరువు నష్టం దావా కేసులో కింది కోర్టు విధించిన శిక్ష పై సుప్రీం స్టే విధించడంతో రాహుల్ గాంధీ లోక్సభ సభ్యత్వం పునరుద్ధరణకు మార్గం సుగమమైంది అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ తిరిగి హాజరుకానున్న దృష్ట్యా ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాతో పాటు బిజెపి ప్రభుత్వానికి ముచ్చమటలు తప్పవని హెచ్చరించారు. భారతదేశంలో న్యాయం ఇంకా మనుగడలోనే ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వు నిరూపించిందని ఆయన కొనియాడారు. ఇక ప్రజా సమస్యలు బిజెపి ఆర్ఎస్ఎస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మణిపూర్ హర్యానా ఢిల్లీ మహారాష్ట్రలోని ముస్లిం మైనార్టీల ఊచ కోతలు ఇతర ప్రజాసమస్యలు పై ప్రభుత్వాన్ని తమ నాయకుడు నిలదీస్తారని పేర్కొన్నారు.

ఆక్రమణలో 'జగనన్న ఇల్లు'.. న్యాయం చేయాలంటున్న బాధితులు

కడప అర్బన్ : నగర పరిధిలోని చింతకొమ్మదిన్నె మండలం చెర్లోపల్లి జగనన్న కాలనీ సర్వే నంబర్ 149,150 లో ప్రభుత్వం నుంచి పట్టా పొందిన లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకున్నారు. కానీ కొందరు ఆ ఇంటిని సైతం ఆక్రమించారు. జగనన్న ఇంటి నిర్మాణానికి 2 బిల్లులు వచ్చాయి. కడ్డీలు, సిమెంట్ ప్రభుత్వం మంజూరు చేసింది. స్లాబ్ లెవల్ గోడలు పూర్తయ్యాయి. ఒక ప్రభుత్వ ఉద్యోగి ఆక్రమించారని బాధితులు పద్మశ్రీ, కిషోర్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో తమకు 2021, జనవరిలో 1.75 సెంట్లు స్థలం ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన బిల్లులతో స్లాబు వరకు గోడలు పూర్తి అయ్యాయాని తెలిపారు. ఇటీవల మా ఇంటికి ఎదురుగా విద్యుత్ స్తంభానికి ఆక్రమణదారులు మీటరు బిగించి ఈ ఇల్లు తమదే అని, రూ.13 లక్షలు ఖర్చు అయ్యింది అని ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్‌కు పిర్యాదు చేయగా ఆక్రమణదారుల పట్టాను పరిశీలించి ఇది దొంగ పట్టా అని చెప్పాం ˆన్నారు. సచివాలయ సిబ్బంది వచ్చి పరిశీలిస్తే వారిపైనా దురుసుగా ప్రవర్తించారని చెప్పారు. ఈ విషయం పై కార్పొరేషన్ కమిషనర్ ను కలిశామని తెలిపారు. ఆయన బాధితులకు ఇంటిని అప్పగించాలని హౌసింగ్ డిఇకి ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మైదుకూరు మండల పరిధిలోని గంజికుంట సచివాలయ పరిధిలోని ఉత్సలవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయన్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు ప్రతి ఇంటకీ వెళ్లి తెలుసు కుంటున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాలలోనే సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ప్రధాన రహదారిలో వర్షం నీరు నిలుస్తుందని డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఉత్సలవరం నుంచి పంట పొలాలకు, బిసిల శ్మశాన వాటికకు వెళ్లే రహదారి లేకపోవడంతో అవస్థలు పడుతున్నామనారు. సమస్య ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి , ఎంపిడిఒ రమణారెడ్డి, ఎఒ ప్రసన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్ నారాయణ రెడ్డి, వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ శివప్రసాద్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక సరస్వతి నగరంలో రెండు రోజుల కిందట జరిగిన విద్యుత్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి టిడిపి నాయకులు కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ అభిమానులు పెద్దబుద్ది వెంకటశివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం రూ. 10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ నాయకుడి సేవా స్ఫూర్తితో తమ వంతు సాయం బాధిక కుటుంబానికి చేశామని చెప్పారు. సాయినాథ్ సూచన మేరకు తమ శక్తి మేరకు ఆర్థిక సాయం చేశామని చెప్పారు. కార్యక్రమంలో శివ, రాజారెడ్డి వెంకట నారాయణ రెడ్డి, చెంగా బ్రహ్మయ్య, షణ్ముఖ, సన్నబోయిన గంగాధర్,శి వ నాయు బ్రాహ్మణ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సచివాలయం ప్రారంభం

దువ్వూరు : మండల పరిధిలోని జిల్లెల గ్రామంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శనివారం మైదుకూరు ఎంఎల్ఎ ఎస్. రఘురామిరెడ్డి ప్రారంభిస్తారని ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పాల్గొనాలన్నారు.

రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

వేంపల్లె : ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఈనెల 6న ఆర్యవైశ్య ఆఫిషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు అవోపా అధ్యక్షులు పుల్లగూర గోవర్ధన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేంపల్లెలోని శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం ఉంటుందని తెలిపారు. వైద్య శిబిరంలో కడపకు చెందినహోమియో వైద్యులు వైద్యులు క్రిష్టిపాటి శేషఫణి హాజరవుతారని పేర్కొన్నారు. ఉచితంగా మందులు కూడ పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ ఉచిత హెూమియో వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా పేదలకు హోమియో వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రతి నెలా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

వేంపల్లె : వాతావరణంలో నెలకొన్న కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటిఆవరణంలో డ్వామా ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటి ఆవరణంలో జడ్‌పిటిసి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, ఎపిఐబిసి డైరెక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవులకు ప్రాణ వాయువును అందిస్తాయని చెప్పారు. వాతావరణ మార్పుల వల్ల కాలుష్యం పెరిగిపోతోందని, వాటిని నివారించాలంటే ఇంటికొక మొక్క తప్పనిసరిగా నాటి పెంచాలని కోరారు. పర్యావరణం సమతుల్యానికి చెట్లు ఎంతో ఉపయోగ పడుతాయాని చెప్పారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ సంధ్యరాణి, డ్వామా పీడీ యధుభూషణ్ రెడ్డి, ట్రిపుల్ ఐటి ఒఎస్‌డి గంగిరెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, ఇడుపులపాయ సర్పంచ్ చలపతి, ఎపిడి సుబ్బారెడ్డి, ఎపిఒ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

50 పడకల ప్రభుత్వాస్పత్రి పరిశీలన

పోరుమామిళ్ల టౌన్ : పట్టణంలోని 50 పడకల ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం పిఆర్అండ్ఆర్‌డి ప్రభుత్వ సలహాదారు పి. నాగార్జున రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ 14 మంది డాక్టర్లకు గాను 11 మంది ప్రస్తుతం సేవలు అందిస్తున్నట్లు ఆయన అన్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలు, మందులు కూడా ఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాస్పత్రులన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రసూతి విభాగం, బ్లడ్ బ్యాంక్ అందుబాటులో ఉందని అన్నారు. ఆయన వెంటన వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

తల్లీబిడ్డలకు అన్ని రకాల వైద్యసేవలందించాం


మాట్లాడుతున్న గైనకాలజిస్ట్

చాపాడు : ప్రసవం కోసం వైద్యశాలకు వచ్చిన గర్భిణి ఎస్తేరు రాణికి అన్ని రకాల వైద్య సేవలు అందజేశామని, అనుకోని విధంగా మృతి చెందడం బాధాకర విషయమని హెచ్‌సిసి వైద్యశాల గైనకాలజిస్ట్ శ్రీలలిత పేర్కొన్నారు. శుక్రవారం మైదుకూరు వైద్యశాలలో తల్లి, బిడ్డ మృతిపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సాధారణ ప్రసవానికి తమ వంతు కృషి చేశామన్నారు. పురిటి నొప్పులు ఎక్కువైనప్పటికీ బిడ్డ కిందికి జారకపోవడం వల్ల కుటుంబ సభ్యుల ఒప్పందంతోనే ఆపరేషన్ చేయాల్సి వచ్చిందన్నారు. ఉన్నత వైద్యుల సమక్షంలో నిర్వహించిన ఆపరేషన్‌లో బిడ్డను ప్రాణాలతో కాపాడలేకపోయామన్నారు. ఆపరేషన్ చేసిన తర్వాత రక్తస్రావం అధికమైందని తగ్గించేందుకు అన్ని విధాల వైద్యం అందించామన్నారు. తర్వాత రక్తస్రావం తగ్గినప్పటికీ శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులున్నాయని గుర్తించి తగిన చికిత్స చేశామన్నారు. అనంతరం ముందు జాగ్రత్తతో వెంటిలేటర్ చికిత్స అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకొని కడపకు తరలించామన్నారు. ఆసమయంలో తల్లి కూడా మృతి చెందడం బాధాకరమన్నారు. తల్లి, బిడ్డ సంరక్షణ కోసం మెరుగైన చికిత్స అందించామని అందుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వ వైద్య అధికారులకు అందజేశామన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ముద్దనూరు

స్థానిక రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు కింద పడి షేక్ అల్లా బకాష్ (32) మృతి చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణం టైలర్స్ కాలనీకి చెందిన షేక్ అల్లాభకాష్ పెయింట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఎక్కడ పడితే అక్కడికి వెళ్లి పనులు చేసుకుంటున్నాడు. ముద్దనూరులో పెయింట్ పని చేసి గురువారం రాత్రి తన స్వగ్రామమైన తాడిపత్రి వెళ్లేందుకు మద్యం మత్తులో రాయలసీమ రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.

సమస్యల వలయంలో 'మున్నెల్లి'

కనీస వసతులు నిల్ - ఇబ్బందుల్లో ప్రజలు - పట్టని అధికారులు

ప్రజాశక్తి- బి.కోడూరు


అధ్వానంగా తయారైన రహదారి

మండలంలోని మున్నెల్లి గ్రామం కనీస వసతులకు నోచుకోలేదు. ముఖ్యంగా డ్రెయినేజీ, రోడ్లు, వీధిలైట్లు వంటి సౌకర్యాలు లేవు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షమొచ్చినప్పుడు రోడ్లన్నీ అధ్వానంగా తయారవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీళ్ల రోడ్లపై ఉండడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. డ్రెయినేజీ సక్రమంగా లేకపోడంతో కొన్ని వీధుల్లో ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉంటూ దోమలకు నిలయంగా మారింది. రోజూ సాయంత్రమైతే దోమలు స్వైరవిహారం చేస్తూ వ్యాధులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లో నుంచి వ్యర్థపు నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా లేదు. వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రుళ్ల వీధులన్నీ అంధకారంగా మారాయి. విష పురుగుల సంచారం అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటు రావడానికి బయపడుతున్నారు. సమస్యలపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. కొందరు గ్రామ కంటాలను ఆక్రమించడంతో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై తహశీల్దార్‌కు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, చెరువులు కూడా అధ్వానంగా ఉందని, ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం మైనార్టీలు

మణిపూర్ అరాచకాలు వ్యతిరేకిస్తూ శుక్రవారం పులివెందుల పట్టణంలో ముస్లిం సోదరులు నిరసన ర్యాలీ నిర్వహించారు. హింసకు కారుకులైన వారిని వెంటనే శిక్షించాలని నినాదాలు చేస్తూ కడప రోడ్డులోని మసీద్ నుంచి పూలంగళ్ల మీదుగా పాత బస్టాండు పాత గంగిరెడ్డి ఆస్పత్రి , తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అక్కడ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన హింసకు కారుకులైన వారిని వెంటనే శిక్షించాలన్నారు దళితులు, ముస్లిమ్ మైనార్టీలపై దౌర్జన్యం చేస్తే సహించేదని లేదని పేర్కొన్నారు దేశంలో ఇలాంటి సంఘటన పునరావృత్తం కాకుండా కేంద్ర ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులివెందుల ముస్లిం కమ్యూనిటీ ముక్తి కలీముల్లా, మౌలానా అబ్దుల్, కలాం మౌలానా ముఖిద్ మౌలానా అబ్దుల్ రహీం మైనార్టీ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆఫీస్ రసూల్, కౌన్సిలర్ ఖాదర్ బాషా, ముస్లిం యువత జహీర్ మహమ్మద్ ఆసిఫ్, నూరు, సోయబ్ నజీర్, వేలాదిమంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

పులివెందుల రూరల్ : పట్టణంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని శుక్రవారం రెడ్డికమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు సురేంద్రారెడ్డి మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్లను కలిసి స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతూ పులివెందుల విగ్రహం ఏర్పాటుకు ఎంపీ అవినాష్‌రెడ్డి పది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుకు అయ్యే రూ. 17 లక్షలు ఖర్చు అంతా తానే భరిస్తానని, స్థలం కేటాయించాలని వారిని కోరానని పేర్కొన్నారు. డిగ్రీకళాశాల రోడ్డు, రాఘవేంద్ర థియేటర్ సమీపంలో, శ్రీరామ హాల్ రోడ్డు సమీపంలో ఎక్కడైనా ఒక చోట ఒక స్థలాన్ని కేటాయించాలని కోరామని చెప్పారు. ఇందుకు వారు సానుకూ లముగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయల సీమ కన్వీనర్ జగదీశ్వర్ రెడ్డి పులివెందుల నియోజకవర్గం నగేష్‌రెడ్డి మా ఊరి సినిమా ప్రొడ్యూసర్ మంజునాథ్ రెడ్డి, రెడ్ల సంఘ అధ్యక్షుడు చంద్ర మోహన్ రెడ్డి, రాయలసీమ యువజన కో కన్వీనర్ అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

పోరుమామిళ్ల : మేజర్ పంచాయితీ పరిధిలో చోటు చేసుకున్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం 2 నుండి 4 వీధులకు మంచినీటి సరఫరా చేసే బోరు చెడిపోవడంతో వెంటనే స్పందించి ఒక్కరోజులోనే దగ్గరుండి బోరు మరమ్మతులు చేయించారు. దీంతో ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభం

ఖాజీపేట : మండల పరిధిలోని కూనవారపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉపకేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనంలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు వల్ల విద్యుత్ సరఫరాలో మెరుగ్గా ఉండటంతో పాటు రైతులకు ఇబ్బందులు తొలగాయని చెప్పారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో గానో కృషి చేస్తోందని తెలిపారు. ఇది ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం సమన్వయకర్త ఎమ్మెల్యే తనయుడు శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్ధిక్, గ్రామ సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, బోరు గంగాధర్ రెడ్డి, వైసీపీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

వేంపల్లె : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరకు సత్యమే జయిస్తుందని రాహుల్ గాంధీ విషయంలో నిరూపితం అయ్యిందని తెలిపారు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మోడీకి, బిజెపికి చెంపపెట్టు అన్నారు. ఇప్పటికైనా బిజెపి కక్ష సాధింపు చర్యలకు మాను కోవాలని సూచించారు. ఈ తీర్పు ద్వారా రాహుల్ గాంధీ ఎంపీగా కొనసాగుతారని చెప్పారు. రాజ్యంగా మూల స్తంభాలైన ప్రజాస్వామ్యంలో లౌకిక వాదం, సామ్యవాదం, స్వేచ్ఛా, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని రాహుల్ గాంధీ పరిరక్షిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధృవకుమార్ రెడ్డి, కాంగ్రెసు నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, బాలం సుబ్బరాయుడు, వేమయ్య , బద్రి, రాఘవయ్య, శివ, అమర్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** బిజెపి కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ సూచించారు. రాహుల్‌గాంధీకి సూరత్‌కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షపై స్టే విధిస్తూ సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ తీర్పు మోడీ, అమిత్‌షాలకు చెంపపెట్టన్నారు. అంతిమ విజయం సత్యానిదే అన్నట్లు అంతిమ విజయం కాంగ్రెస్‌దే అన్నారు. రాహుల్‌గాంధీ ఎంపీగా కొనసాగుతారని, భారత ప్రధాని మంత్రి పదవిని అలంకరించి భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తారని అన్నారు. **కడప :** రాహుల్ గాంధీ పట్ల సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరు హర్షనీయమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టిఐ చైర్మన్ కోటపాటి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం ఆయన మీడియాత మాట్లాడుతూ మంచి వారికి మంచే జరుగుతుందని రాహుల్ గాంధీ పట్ల సుప్రీంకోర్టు స్టే తో నిజమైంది అని అన్నారు ప్రధాన మంత్రి రాజకీయ కక్షతో గుజరాత్ సూరత్ కోర్టులో రెండు సంవత్సరాల శిక్ష రాహుల్ గాంధీ పట్ల విధించిన సంగతి విధితమే అన్నారు. ఇలాంటి దుర్మార్గమైన తీర్పులకు చంపపెట్టుగా సుప్రీంకోర్టు రాహుల్ గాంధీ శిక్ష పట్ల స్టే విధించడం అనేది ప్రజాస్వామ్య విజయమని అన్నారు.

కాంగ్రెస్ నాయకులు సభ్యులు బండి జకరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలోని విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద పెద్ద బాణాసంచాలు పేల్చి, స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు విష్ణు ప్రియతమ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మధు రెడ్డి, ఆర్టిఐ చైర్మన్ లక్ష్మయ్య,కార్మిక విభాగం పుల్లయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సూర్యవంశీ యాదవ్, ఎన్ ఎస్ యు ఐ బాబు, కాంగ్రెస్ నాయకులు భువన ఏకాదశి రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్ పాల్గొన్నారు.

జిల్లాలో టిడిపికి ఒక్క సీటూ రాదు : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు: రాబోయే ఎన్నికల్లో టిడిపి కడప జిల్లాలో ఒక్క సీటు కూడా రాదని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి జోస్యం చేశారు. శుక్రవారం స్థానిక గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు పులివెందుల పర్యటన సందర్భంగా మాట్లాడిన మాటలు చూస్తుంటే కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించుకున్నట్లుగా ఉందని అన్నారు. గతంలో చంద్రబాబు కడపనుద్దేశించి మాట్లాడిన మాటలు కడప బిడ్డలకు గుర్తుందన్నారు. కడప వాసులను రౌడీలుగా, గుండాలుగా, రాక్షసులుగా, అనాగరికులుగా వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ఈ జిల్లావాసులకు అభివృద్ధి అక్కర్లేదని గొడ్డుకారం సంగటి తినేవాళ్లని, ఇక్కడెందుకు విమానాశ్రయం అని అన్నమాటలు గుర్తున్నాయన్నారు. షర్మిల, సునీతలపై వగలమారి మాటలు ఒలకబోస్తూ క్షుద్రరాజకీయానికి తెరతీశారన్నారు. ప్రేమపాశాన్ని వదలుతున్నారన్నారు. యస్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన బాబుకు రక్తసంబంధం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వివేకా మరణాన్ని రాజకీయానికి వాడుకుంటున్నారని, న్యాయస్థానంపై తమకు నమ్మకం ఉందని ఎంపీ అవినాష్ శాంతిస్వరూపుడన్న విషయం అందరికీ తెలుసన్నారు. బాబుపై ఉన్నకేసులన్నీ స్టేలపై ఉన్నాయన్నారు. 2014-19 మధ్యకాలంలో టిడిపి కడప జిల్లాకు చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, వైయస్‌లాగా అమలుపరచిన సంక్షేమ, చేసిన అభివృద్ధి ఏదీలేదన్నారు. చంద్రబాబుకు, లోకేష్‌కు ఎన్టీఆర్ శాపం తగిలిందన్నారు.

20లోగా ఓటు నమోదు పూర్తి చేయాలి : ఆర్‌డిఒ

లింగాల : ఈనెల 20 లోగా ఓటరు నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని పులివెందుల ఆర్‌డిఒ వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల నుంచి మండలంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని చెబుతున్నా, బిఎల్ఒలు 50 శాతం మాత్రమే నమోదు చేశారని చెప్పారు. నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సురేంద్రనాథ్, విఆర్ఒలు, ఆర్ఐ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తున్న పుట్టా

ఖాజీపేట : టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో అన్ని వర్గాల వారికి ఆమోదయోగ్యంగా ఉందని మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. నిరుద్యోగులకు నిరుద్యోగిభృతి కింద నెలకు రూ రూ. 3వేలు, మహాశక్తి ఆడబిడ్డ నిధి పథకం పేరుతో 18 నుండి 59 వయస్సున్న ఉన్న మహిళలకు ప్రతీ నెలా రూ. 1500, తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్న ప్రతీ ఒక్కరికి రూ. 15 వేలతోపాటు దీపం పథకం పేరుతో ఉచితంగా యేటా ఒక కుటుంబానికి 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తారని చెప్పారు. అక్క చెల్లెమ్మలందరికి ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగ శివారెడ్డి , సీనియర్ నాయకులు హజరత్ యాదవ్, బాల వెంకటయ్య, జలీల్, తుట్టె రాముయాదవ్, నరసింహులు, ఖదిరుల్లా, వెంకట్రామిరెడ్డి,,రామ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -ఖాజీపేట

స్థానిక పేరారెడ్డి కొట్టాల సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి శుక్రవారం అన్నారు. ఆదర్శ పాఠశాలలో భోజనం తనిఖీ చేయగా చెడిపోయిన గుడ్లు ఇవ్వడం గుర్తించామని చెప్పారు. ప్రశ్నించిన విద్యార్థులను భయాందోళన గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ ప్రిన్సిపల్ నిర్లక్ష్యంగా సమా ధానం ఇస్తూ సమస్యలు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని వారు తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదని, దీంతో విద్యా ర్థులు దాహార్తికి ఇబ్బందులు పడటంతో పాటు కలుషిత నీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురి అవుతున్నారని వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం ప్రిన్సిపల్‌ని ప్రశ్నించగా పాఠశాలలోకి అనుమతి లేదంటూ విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల, విద్యార్థి సంఘాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రవివర్మ, ఎస్ఎఫ్ఐ మండలం నాయకులు అరవింద్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

బద్వేలు : అన్నదానం గొప్పదని మున్సిపల్ కమిషనర్ కె.వి కృష్ణారెడ్డి అన్నారు. ఆరోగ్య భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు బండి రాకేష్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉండే ఆనంద నిలయంలో నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ కె.వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య భారత్ ఫౌండేషన్ సభ్యులు బృందంగా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య భారత్ ఫౌండేషన్ అధ్యక్షులు రహీం, సభ్యులు శ్రీకర్, సునీల్, హరికృష్ణ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, విశ్వ నాథ్ రెడ్డి, సుబ్బయ్య, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

పట్టాలిచ్చామని చెప్పడం సరికాదు :'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాజధాని నిర్మాణం కోసం వేల ఎకరాలు భూమిని రైతులు ఇస్తే నేడు రాజధానిని పూర్తిగా నిలిపేసి ఆర్-5 జోన్‌లోని భూమిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని చెప్పుకోవడం సరికాదని మాజీ ఎమ్మెల్యే టిడిపి నేత నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో అమరావతి రాజధాని అంటే అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కూడా రాజధాని అమరావతిని స్వాగతించారన్నారు. ఇప్పుడు మూడు రాజధానులు అంటూ మాట్లాడటం దుర్మార్గమని చెప్పారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇప్పటికీ కౌలు ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తుందని, భూములు విషయమై సుప్రీంకోర్టులో కూడా కేసు నడుస్తుందోని, లెక్కచేయకుండా ముఖ్యమంత్రి ఇళ్ల పట్టాల పంపిణీ చేయడం న్యాయం కాదని వరదరాజుల రెడ్డి అన్నారు. నేడు రాజధాని ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను తుది తీర్పు వచ్చేవరకు వెంటనే నిలిపివేయాలని కోర్టు తీర్పు చెప్పిందని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, అధికారులలో మార్పు రావాలని ,రాజధాని రైతులకు న్యాయం చేయాలని వరదరాజల రెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహానందిపల్లెలో గడప గడపకూ...

ప్రజాశక్తి-కలసపాడు


పథకాల గురించి తెలియజేస్తున్న ఎమ్మెల్యే సుధ

మండలంలోని మహానందిపల్లిలో గడపగడప మన ప్రభు త్వం కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ డి. శ్రీనివాసన్ రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ముందుగా ఎంపిడిఒ మహబూబ్‌బీ మహానందిపల్లె గ్రామ సచివాలయ అభివృద్ధి గురించి తెలియజేశారు. అనంతరం సర్పంచ్ డి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీలో చర్చి కాలనీ, రెడ్డికాలనీ, వెంకటేశ్వర నగర్, సిద్ధమూర్తి పల్లి గ్రామాలలో రహదారులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, ఏవైనా సమస్యలున్నట్లయితే అప్పటికప్పుడే పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఇంటింటికీ వెళ్లి రాజకీయ ప్రతినిధులతో, సచివాలయ సిబ్బందితో కలిసి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి పురుషోత్తం రెడ్డి, ఎంపిపి నారాయణ, లీడ్ క్యాప్ డైరెక్టర్ సగిలి సుదర్శన్, జెసిఎస్ మండల కన్వీనర్ చిత్తా, రాజశేఖర్‌రెడ్డి, వైసిపినాయకులు రామసుబ్బారెడ్డి , విష్ణు, పుల్లారెడ్డి, గోవిందరెడ్డి, తిరుపాల్రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొప్పలు చెప్పకోవడం విడ్డూరం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలో, రాయలసీమలో జరిగిన అభివృద్ధి, గొప్పలు చెప్పుకోవడం టిడిపి, వైసిపి చెప్పుకోవడం సిగ్గు చేటని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. . శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెసు హయాంలోనే పులివెందులలో జెఎన్‌టియు, ట్రిపుల్ ఐటి, శిల్పారామం, అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రం, రింగు రోడ్లు, భూగర్భ డ్రెయినేజీ, ప్రతి పల్లెలో సిమెంట్ రోడ్లు వచ్చాయని తెలిపారు. పైడిపాలెం, గండి కోట రిజర్వాయర్ నుంచి చిత్రవతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎత్తిపోతల, లింగాల కెనాల్, పిబిసి ఆధునీకరణ పనులు కాంగ్రెస్ హయంలోనే జరిగినట్లు చెప్పారు. కడపకు సంబంధించి రిమ్స్ వైద్యశాల, స్పోర్ట్స్ స్కూల్, సెంటర్ స్కూల్, విమానాశ్రయం ఆధునికరణ, యోగి వేమన విశ్వవిద్యాలయం నిర్మించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ఉచిత విద్యుత్, సున్నా, పావలా వడ్డీ రుణాలు, ఎస్టీ, ఎస్సీ సబ్ ప్లాన్‌కు చట్ట భద్రత, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, 108, 104, ఉపాధి హామీ చట్టం, బంగారు తల్లి లాంటి పథకాలు అమలు చేశారని తెలిపారు. వైసిపి, టిడిపి రెండూ రాయలసీమకు ద్రోహం చేశారని పేర్కొన్నారు.

పురుగు మందుల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి

చక్రాయపేట : పంట పొలాల్లో రసాయనిక పురుగు మందులు వాడకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి నవంత్ బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని కుప్పం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో పొలం బడిలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిఒచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వివిధ పంటలకు అవగాహన లేకుండా, చీడపీడల నివారణకు విచక్షణ రహితంగా పురుగు మందులు వాడడం వల్ల, పర్యావరణం కాలుష్యం తో పాటు, మానవ శరీరంలోని వివిధ భాగాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా తలనొప్పి, కళ్ళు తిరగడం, నరాల బలహీనతన, శ్వాస పరమైన ఇబ్బందులు వచ్చే ప్రమాదముందని చెప్పారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం మంచిదని, ఆయన సలహాలు, సూచనలు చేశారు. రసాయన పురుగు మందులు, మోతాదులో పిచికారీ చేసుకోవాలని ఆయన వివరించారు. కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.